# రష్యా-జార్జియా యుద్ధం... అంతర్జాతీయ సమీకరణాలు!

రష్యా- జార్జియాల మధ్య యుద్ధం పది రోజులు కొనసాగింది. ఇరుదేశాలూ శాంతికి అంగీకరించటంతో... సమస్య ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు జార్జియాలోకి దూసుకెళ్లిన తన సేనలను ఉపసంహరించుకుంటానని.. రష్యా ప్రకటించింది. దాంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గే అవకాశముంది!!

రష్యా- జార్జియాల మధ్య అనధికారికంగా కుదిరిన కాల్పుల ఒప్పందం ప్రకారం... ఇరుదేశాలూ.. 1) బలప్రయోగానికి స్వస్తి చెప్పాలి 2) పరస్పర శత్రుత్వాన్ని తగ్గించుకోవాలి 3) మానవతా సహాయాన్ని అందించటానికి ఎలాంటి ఆంక్షలు విధించరాదు 4) తమ తమ సైన్యాలను యుద్ధ ప్రారంభానికి ముందున్న స్థానాలకు ఉపసంహరించుకోవాలి 5) తమ పౌరుల, శాంతి రక్షకదళాల భద్రత కోసం రష్యా చేపట్టే భద్రతా చర్యలను అనుమతించాలి 6) యుద్ధానికి కారణమైన సమస్యను చర్చల ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేయాలి. జర్మనీ, ఫ్రాన్స్ దేశాల అధ్యక్షులు.. రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్‌తో చర్చలు జరిపి, ఈ శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించకుండా అమలు చేయాలని కోరారు. యుద్ధాన్ని విరమిస్తానన్న తన మాటలకు రష్యా ఇప్పటికైనా కట్టుబడి ఉంటుందని భావిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి కండొలిజా రైస్ పేర్కొన్నారు. రష్యా-జార్జియాల మధ్య యుద్ధం.. ప్రపంచస్థాయిలో సమీకరణాలను సైతం ప్రభావితం చేసే అవకాశముంది. ఈ యుద్ధం కారణంగా... రష్యా-అమెరికా, రష్యా-యూరోపియన్ యూనియన్ సంబంధాలు దెబ్బతినటమే కాక.. ఇరాక్‌లో అమెరికా సైనిక చర్యపై కూడా ప్రభావం చూపే పరిస్థితి తలెత్తింది.

### పోరు ఎందుకు ప్రారంభమైంది?

ఒకప్పటి సోవియట్ రష్యాలో ఒక రిపబ్లిక్‌గా ఉన్న జార్జియా.. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావటంతో.. స్వాతంత్ర్యం పొంది కొత్తదేశంగా అవతరించింది. 1991లో జార్జియా స్వాతంత్ర్యాన్ని పొందినపుడే.. జార్జియాలోని రెండు ప్రావిన్స్‌లు దక్షిణ ఒసేటియా, అబ్కాజియాలు.. జార్జియాలో అంతర్భాగంగా ఉండటానికి అంగీకరించలేదు. ఇవి స్వాతంత్ర్యం కావాలని పోరు ప్రారంభించటంతో.. ఆ రెండు ప్రావిన్స్‌లలోనూ అంతర్యుద్ధం మొదలైంది. సోవియట్ యూనియన్ ఉన్న కాలంలో.. దక్షిణ ఒసేటియా జార్జియా రాష్ట్రంలోనూ, ఉత్తర ఒసేటియా రష్యాలోనూ ఉండేది. జార్జియా స్వతంత్రదేశంగా అవతరించినప్పటినుంచీ... దక్షిణ ఒసేటియా, జార్జియాల మధ్య ఘర్షణలు జరుగుతూనే వచ్చాయి. దక్షిణ ఒసేటియాలో ఉన్న 70 వేల మంది ప్రజల్లో... 90 శాతం మంది రష్యన్ భాష మాట్లాడేవారు.. రష్యన్ పాస్‌పోర్టు కలిగి ఉన్నవారు.. వీరిలో అధిక శాతం మంది దక్షిణ ఒసేటియాను రష్యాలో విలీనం చేయా

లని కోరుతున్నారు. వీరిలోనే కొంతమంది రెబల్స్‌గా మారి, జార్జియా సేనలపై దాడులు చేస్తుండటంతో... ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దక్షిణ ఒసేటియాలో శాంతిని పరిరక్షించటానికి రష్యా కొంతమంది శాంతిరక్షక దళాలను ఉంచుతూ వచ్చింది. రెబల్స్‌ను కట్టడి చేసేందుకు జార్జియా ఎప్పటి నుంచో ప్రయత్నం చేస్తున్నా... సఫలం కాలేకపోయింది.

రెబల్స్‌ను కట్టడిచేసి, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని జార్జియా... దక్షిణ ఒసేటియాలోకి తన సేనలను పంపటంతో ప్రస్తుత సమస్య మొదలైంది. జార్జియా సేనల దాడిలో.. దక్షిణ ఒసేటియాలో ఉన్న తమ శాంతిరక్షక దళాల సభ్యులు కొంతమంది మరణించారనీ... రష్యన్ పౌరులు ఎక్కడున్నా, వారిని కాపాడటం రష్యా బాధ్యత అనీ...జార్జియా సేనలు పూర్తిస్థాయి బలంతో విరుచుకుపడటంతో, దక్షిణ ఒసేటియాలో ఉన్న తమ పౌరులు కూడా మరణించారని...ఆ దేశం దురాక్రమణను సహించేది లేదంటూ... రష్యా తన సైనిక దళాలను జార్జియాపైకి పంపింది. దక్షిణ ఒసేటియాలోకి చొచ్చుకువచ్చిన జార్జియా దళాలను తిప్పికొట్టటమేకాక... రాజధాని తిబిలిషికి 10 కిలోమీటర్ల దూరం వరకూ రష్యా సేనలు దూసుకువచ్చాయి. దాంతో 70 శాతం దక్షిణ ఒసేటియా తమ ఆధీనంలోకి వచ్చిందని ప్రకటించిన జార్జియా, ఆత్మరక్షణలో పడింది. ప్రపంచం దృష్టంతా బీజింగ్ ఒలింపిక్స్‌పై ఉండగా.. జార్జియా సేనలు దక్షిణ ఒసేటియాపై విరుచుకుపడ్డాయి. రష్యా సైన్యం ప్రత్యక్షంగా ఎదురుదాడికి దిగి.. జార్జియాపై ముమ్మరంగా వైమానిక దాడులు జరిపింది. రష్యాలో విలీనం కావాలని కోరుతున్న వేర్పాటువాదుల చర్యలు పెచ్చుమీరాయని.. అందుకే తాము దాడికి దిగామని జార్జియా చెబుతోంది. జార్జియా దాడిలో తమ శాంతిసేనలు మరణించాయనీ.. ఆ దేశం తమ జాతీయులపై హననానికి దిగిందనీ.. అందుకే తాము జోక్యం చేసుకోవాల్సి వచ్చిందనీ రష్యా ప్రకటించింది. ఇలా రెండు దేశాలూ ఒకరినొకరు దురాక్రమణదారుగా పేర్కొన్నాయి.

అంతర్యుద్ధం తర్వాత 1992లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న దక్షిణ ఒసేటియా, అబ్కాజియాలను... స్వతంత్ర దేశాలుగా గుర్తించకపోవటంతో.. 16 ఏళ్లుగా అనిశ్చితి కొనసాగుతూ వచ్చింది. ఈ రెండు ప్రావిన్స్‌లూ తనదేశంలో అంతర్భాగంగా జార్జియా పేర్కొంటున్నా.. రష్యా శాంతి పరిరక్షక దళాలు, ఈ రెండు ప్రావిన్స్‌లలోనూ ఉంటూవచ్చాయి. అంతేకాక తాము స్వాతంత్ర్యం ప్రకటించుకున్నప్పటినుంచీ.. ఈ రెండు ప్రావిన్స్‌లూ రష్యాపై ఆర్థికంగా ఆధారపడుతూ వస్తున్నాయి. రష్యా దాడితో కంగుతిన్న జార్జియా.. ఇరాన్‌లో ఉన్న తన 2000 మంది సైన్యాన్ని వెనక్కి పిలిచింది. ఇరాక్‌లో అమెరికా, బ్రిటన్‌ల తర్వాత అధిక సంఖ్యలో సైన్యాన్ని పంపింది జార్జియానే.

### వ్యూహాత్మక కారణాలు ఏంటి?

**తన పొరుగు దేశాలపై నియంత్రణ సాధించటం:** జార్జియా రెబల్ ప్రావిన్స్‌లైన దక్షిణ ఒసేటియా, అబ్కాజీయాలను రష్యా సమర్థించటానికి కారణం.. జార్జియాను అదుపులో ఉంచటానికే. జార్జియా ఇటీవల

అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలకు సన్నిహితంగా మెలుగుతూ నాటో (North Atlantic Treaty Organisation.. NATO)లో సభ్యదేశంగా మారటానికి ప్రయత్నిస్తోంది. జార్జియాపై తాజా దాడి... 1991 వరకూ సోవియట్ యూనియన్‌లో ఉండి.. తర్వాత విడిపోయిన చిన్న చిన్న రిపబ్లిక్‌లకు (అమెరికా, ఇతర పశ్చిమ దేశాలతో సన్నిహితంగా మెలగటానికి ప్రయత్నిస్తున్న వారికి)... రష్యా పంపిన హెచ్చరికగా భావించవచ్చు. తనకు ఎదురుతిరిగి, తన ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే.. సహించేది లేదంటూ... తన పొరుగున ఉన్న చిన్న దేశాలకు రష్యా పంపిన సందేశం ఇది!

**పెరుగుతున్న అమెరికా జోక్యం:** గతంలో సోవియట్ యూనియన్‌లో ఉండి... 1991లో స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించిన చిన్నచిన్న దేశాలతో సన్నిహిత సంబంధాలు పెంచుకుని...తనను నిలువరించటానికి అమెరికా ప్రయత్నిస్తోందన్నది రష్యా భావన. జార్జియాను నాటోలో చేర్చేందుకు అమెరికా పావులు కదపటం... జార్జియా కూడా ఆ దిశగా అడుగులు వేయటంతో.. తన సరిహద్దులో స్థితి పక్కలో బల్లెంలా మారగలదని రష్యా అభిప్రాయం. ప్రస్తుతం జార్జియా నాటో సభ్యదేశం కాదు. అందువల్ల జార్జియాకు సాయంగా యూరప్ కానీ, అమెరికా కానీ వచ్చే అవకాశం లేదు. దాంతో జార్జియాపై సైనిక చర్య ద్వారా రష్యా తన బలాన్ని చాటిచెప్పింది. అంతేకాకుండా జార్జియా, ఉక్రెయిన్‌ల నాటో ప్రవేశానికి మద్దతిస్తున్న అమెరికాకు...నాటో విస్తరణకు తన వ్యతిరేకతను తెలియజేసింది.

**కాస్పియన్ క్షేత్ర చమురు నిక్షేపాలు:** కాస్పియన్ సముద్ర క్షేత్రంలో అపారమైన చమురు నిక్షేపాలున్నాయి. కాస్పియన్ సముద్రం నుంచి నల్లసముద్ర తీరానికి.. కాస్పియన్ సముద్ర తీరం నుంచి టర్కీకి వెళ్లే చమురు పైప్‌లైన్లు... జార్జియా నుంచి వెళ్తున్నాయి. సోవియట్ యూనియన్ కాలంలో... కాస్పియన్ తీరం నుంచి వెళ్లే ప్రతి చమురు పైప్‌లైన్, రష్యా నుంచి వెళ్లేది. దాంతో ఆ చమురు నిక్షేపాల ఎగుమతులు, రవాణాపై రష్యా పూర్తి నియంత్రణ ఉండేది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అనంతరం.. ఈ చమురు నిక్షేపాలపై రష్యా ఆధిపత్యాన్ని తగ్గించేందుకు అమెరికా, ఇతర నాటో దేశాలు ప్రయత్నాలు ఆరంభించాయి. పశ్చిమ యూరోప్‌కు గ్యాస్ సరఫరాకు రష్యాను bypass చేస్తూ... రష్యా పొరుగు దేశాల్లోంచి గ్యాస్/చమురు పైప్‌లైన్లు వేయటం ప్రారంభమైంది. వీటిలో బాకు(అజర్‌బైజాన్ రాజధాని) – తిబిలిషి (జార్జియా రాజధాని) – సెహాన్ (టర్కీలో ఓడరేవు) (దీన్నే BTC పైప్‌లైన్ అంటారు) ఆయిల్ పైప్‌లైన్ అతిముఖ్యమైంది. కాస్పియన్ సముద్రానికి అన్నివైపులా భూమి ఉండటంతో (Land Locked).. ఈ చమురు పశ్చిమ దేశాల మార్కెట్లకు చేరటం చాలా కష్టం. కాస్పియన్ తీరం నుంచి వెళ్లే ప్రతి ఆయిల్ పైప్‌లైన్ తన దేశం నుంచి వెళ్తే... చమురు రంగంలో తన ఆధిపత్యం కొనసాగుతుందని రష్యా భావిస్తోంది. BTC పైప్‌లైన్ నిర్మాణం 1993లో ఆరంభమై.. 2005లో పూర్తయింది. దీని పొడవు 1770 కిలోమీటర్లు. ఇదేకాక బాకు–సుప్సా (జార్జియాలోని పోర్టు) పైప్‌లైన్, బాకు–తిబిలిషి–సుఖుమి (రెబల్ ప్రావిన్స్ అబ్ఖాజియాలో ఉంది) జార్జియాతో యుద్ధంవల్ల ఈ పైప్‌లైన్లన్నీ ఆయిల్/సహజవాయువు పంపింగ్ ఆపివే

శాయి. ఈ ప్రాంతం నుంచి వెళ్లే చమురు ఎగుమతుల మార్గాలపై తన పట్టును బలపర్చుకోవటానికి.. పశ్చిమ దేశాల జోక్యాన్ని నిరోధించటానికి... రష్యా ఉపక్రమించిందని నిపుణుల అభిప్రాయం. జార్జియాపై దాడిచేసి నిరోధించటం ద్వారా... తన ఇరుగుపొరుగు దేశాలైన ఉక్రెయిన్, అజర్‌బైజాన్‌లకు కూడా హెచ్చరిక పంపిందని వారి అభిప్రాయం. ఈ విధంగా మధ్య ఆసియాలోని గ్యాస్, ఆయిల్ పైప్‌లైన్లను తనకు నచ్చినట్లు కట్ చెయ్యగలనని..చమురు సరఫరాను నియంత్రించగలనని.. రష్యా, పశ్చిమ యూరోప్‌కు కూడా సందేశం ఇవ్వకనే ఇచ్చినట్లయింది.

**చిన్న దేశాలకు స్వాతంత్ర్యం కోసం పశ్చిమ దేశాల మద్దతు - NATO విస్తరణ:** సెర్బియాలోని కొసావోకు స్వాతంత్ర్యం కోసం నాటో.. అమెరికా తదితర దేశాలు మద్దతిచ్చినపుడు.. జార్జియాలోని రెబల్ ప్రావిన్స్‌లకు కూడా ఆ హక్కుంటుందని రష్యా వాదన. కొసావోకు స్వాతంత్ర్యాన్ని రష్యా వ్యతిరేకించింది. నాటోలోకి ఉక్రెయిన్, జార్జియాలను చేర్చుకోవాలన్న అమెరికా వాదనను.. జార్జియాలోని రెబల్ ప్రావిన్స్‌లకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలనే డిమాండ్ ద్వారా ఎదుర్కోవాలని రష్యా వ్యూహం. ఒకవేళ జార్జియా, నాటోలో సభ్యదేశమైతే అమెరికా-రష్యాల మధ్య యుద్ధం వచ్చేదేమో. ఈ రకంగా నాటోలోకి కొత్త దేశాలను చేర్చుకుని తూర్పు యూరోప్‌లో రష్యాకు చెక్ పెట్టాలన్న అమెరికా ఎత్తుగడను తిప్పికొట్టటానికే రష్యా, జార్జియాపై ప్రతిదాడికి దిగిందని విశ్లేషకుల అభిప్రాయం. సెర్బియాపై దాడిచేసి కొసావోలోని ఆల్బేనియన్లకు స్వాతంత్ర్యాన్ని సమర్థించటం ద్వారా అమెరికా ప్రారంభించిన ఇలాంటి చర్యలను ఖండించిన రష్యా కూడా ఇప్పుడు అదేబాటలో వెళుతోంది. జార్జియా అధ్యక్షుడు మిఖాయిల్ సాకషివిలి తాను రెబల్ ప్రావిన్స్‌లపై దాడిచేసి విలీనం చేసుకుంటే.. తనకు అమెరికా మద్దతుంటుందని, రష్యా ప్రతిదాడి చేయకపోవచ్చనీ భావించారు. కానీ అలా జరగలేదు. వ్యూహం ఫలించకపోవటంతో దాడి ప్రారంభించింది జార్జియానే అయినా రష్యాను దురాక్రమణదారుగా అభివర్ణించటం ప్రారంభించింది.

**ప్రధానమంత్రిగా పుతిన్ పట్టు:** రెండుసార్లు రష్యా అధ్యక్షుడిగా ఉన్న వ్లాదిమీర్ పుతిన్.. మూడోసారి అధ్యక్షుడు కావటానికి రాజ్యాంగం అనుమతించలేదు. దాంతో అనుయాయుడైన దిమిత్రీ మెద్వెదేవ్‌ను రష్యా అధ్యక్షుడిగా ఎన్నికయ్యేలా చేశారు. తాను ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. మెద్వెదేవ్ అధ్యక్షుడైనా అసలైన నిర్ణయాధికారం తన చేతిలోనే ఉందని పుతిన్ ప్రపంచానికి చాటిచెప్పారు. రష్యాను సమర్థమైన, శక్తిమంతమైన దేశంగా తీర్చిదిద్దాలన్న ఆయన ఆకాంక్ష ఈ చర్యతో మరింత రుజువైంది.

**యుద్ధం వల్ల పర్యవసానం:** పశ్చిమ దేశాలు తమ చమురు అవసరాలను కాస్పియన్ తీర నిక్షేపాలతో తీర్చుకోవచ్చనే ఆలోచనపై పునరాలోచనలో పడొచ్చు. ఎందుకంటే బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టి పైప్‌లైన్ల నిర్మాణం పూర్తిచేసిన తర్వాత.. ఇలాంటి ఘర్షణల వల్ల చమురు ఎగుమతులు ఆగిపోతే.. ఆయా దేశాల పెట్టుబడులకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదముంది. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పెట్టుబడులు

వచ్చే అవకాశాలు దెబ్బతినటమేకాక, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరికొన్ని పైప్‌లైన్ల పనుల్లో తీవ్ర జాప్యం జరగొచ్చు. రష్యా ఇరుగుపొరుగు రిపబ్లిక్‌ల పని అడకత్తెరలో పోకచెక్కగా మారే అవకాశముంది. రష్యా ప్రతిదాడికి నిరసనగా, యూరోప్ దేశాలు రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధిస్తే.. రష్యా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కావచ్చు. అంతేకాక రష్యా WTO (ప్రపంచ వాణిజ్య సంస్థ)లో చేరటానికి చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం ఏర్పడవచ్చు. అమెరికా, ఇతర యూరప్ దేశాలు నాటోను మరింతగా తూర్పు యూరప్ దేశాలలోకి విస్తరించడానికి గట్టిగా ప్రయత్నిస్తే... దానికి రష్యా మరింత ఘాటుగా స్పందిస్తే... మరో ప్రచ్ఛన్నయుద్ధ మేఘాలు కమ్ముకోవచ్చు!!

**నాటో అంటే... నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్.. అమెరికా, యూరోప్ దేశాల మధ్య పరస్పర రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ. ఏదైనా సభ్యదేశంపై, మరే ఇతర దేశమైనా దాడిచేస్తే.. మిగిలిన సభ్యదేశాలన్నీ దాడికి గురైన సభ్యదేశానికి సాయంగా యుద్ధం చేస్తాయి.**